క్లుప్తంగా

రక్తదాన శిబిరం

కడప ఎడ్యుకేషన్: నగర శివార్లలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రెడ్‌క్రాస్, స్టెప్ ఆఫీస్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగరాజా మాట్లాడుతూ మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం అవుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం వారితోపాటు విద్యార్థులు రక్తదానం చేశారు.

కొప్పర్తిలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం



ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, వలంటీర్లు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్–1 ఆధ్వర్యంలో కొప్పర్తి గ్రామంలో ప్రత్యేక క్యాంపు సోమవారం ప్రారంభమైంది. ఈ క్యాంపును వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి గ్రామ ప్రజలు వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ సేవలను గుర్తుంచుకునేలా సేవలు ఉండాలన్నారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సరిత మాట్లాడుతూ క్యాంపు వారంరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

కడప సెవెన్‌రోడ్స్ : సూర్య డెవలపర్ అధినేత కంచి సురేంద్రనాథ్ జన్మదిన సందర్భంగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కడప కేంద్ర కారాగార సమీపంలోని శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు చీరలు, కేకులు, పండ్లు పంపిణీ చేశారు. తొలుత కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రియల్టర్ ఎం.అరుణ్, కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, రవి, శివశంకర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు...

కడప సెవెన్‌రోడ్స్ : నగరంలోని ముస్లిం మైనార్టీ ఆర్గనైజ్ కార్యాలయంలో సోమవారం మాజీ డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో పేదలకు దానధర్మాలు పుణ్యదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ హాజీ ఖాన్, హజ్ కమిటీ సభ్యులు ముస్తాక్ అహ్మద్ షామీర్, అబ్దుల్లా పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి బస్సులు కొనసాగిస్తాం



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రమిస్తున్న కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రులు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల సౌకర్యార్థం ఇప్పుడు నడుస్తున్న బస్సు సౌకర్యం భవిష్యత్తులో కూడా కొనసాగుతుందని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ చైర్మన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. రానున్న కాలంలో కేంద్రీయ విద్యాలయ సంస్థకు బస్సులను నడిపే విషయంలో పలు అనుమానాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇందుకు ఆర్టీసీ చైర్మన్ స్పందిస్తూ ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని, బస్సు యదావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

అన్నదానం పుణ్యకార్యం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అన్నదానం మహాపుణ్య కార్యం అని కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు శేషావల్లి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ వసతి గృహంలో దేవినేని రాజశేఖర్ ఆరో వర్ధంతి సందర్భంగా పేద విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరికి కలిగి ఉండాలన్నారు. నరేంద్రనాథ్, శ్యామ్, బద్రి, మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాన్నా శివయ్య డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమన్ భవన్‌లోసోమవారం నిర్వహించిన ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులందరికీ 45 శాతం ఫిట్‌మెంట్‌తో త్వరితగతిన వేతన సవరణ చేయాన్నారు. గ్రేడ్–2 జెఎల్‌ఎంలకు ఏపీఎస్ఈబీ స్కీస్ రెగ్యులరైజ్ చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

విపత్తుల వేళ అప్రమత్తత అవసరం

– అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి బసిరెడ్డి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

వైవీయూ: అగ్ని విపత్తుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి బసిరెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, డెమో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు, గృహనిర్మాణాలు, ఆసుపత్రుల నిర్మాణసమయంలో, విద్యుత్ సరఫరాలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంటింటిలో గ్యాస్ సిలండర్ వినియోగించడంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు ఆర్పడంలో పాటించాల్సిన నియమాలను వివరించారు. ఏవైనా అగ్నిప్రమాదాలు, పర్యావరణ విపత్తులు ఎదురైనప్పుడు 08562–242299 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. సుబ్బలక్షుమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మిదేవి, డా. పి. శచీదేవి, అధ్యాపకులు శ్రీనివాసులరెడ్డి, నాగవేణి, రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్‌లో స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభం



స్విమ్మింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని కడప ఆఫీసర్స్ క్లబ్‌లో స్విమ్మింగ్ సమ్మర్ క్యాంపు శిక్షణను ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి యదుభూషణ్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం క్లబ్‌లో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ శిబిరాన్ని క్లబ్ సభ్యులు, 8 ఏళ్ల పైబడిన చిన్నారులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని గెజిటెడ్ అధికారులందరూ ఆఫీసర్స్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. స్విమ్మింగ్ శిక్షణ కోసం పాల్‌రెడ్డిని 9966518830 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, కోశాధికారి వీరభద్రయ్య, ఈసీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, శిక్షకుడు యోగీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అంబేడ్కర్ రత్న’కు అభినందనలు

కడప కల్చరల్ : జాతీయ స్థాయి అంబేడ్కర్ రత్న పురస్కారాన్ని పొందిన కడప నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత వర్గాల అభివృద్ధి సంఘం నిర్వాహకులు పీఎం రవికుమార్‌బాబుకు సోమవారం మిత్రులు, సన్నిహితులు, పరిచయస్తులు అభినందించారు. సంస్థ ద్వారా శిక్షణ పొంది వివిధ చేతి వృత్తుల్లో ఆర్థికంగా బలపడిన వారిలో పలువురు అక్కాయపల్లెలోని సంస్థ కార్యాలయంలో రవికుమార్‌ను కలిసి సత్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిసి జాతీయ స్థాయిలో ఆయన ఎంతో అభిమానించే అంబేడ్కర్ పేరిట పురస్కారాన్ని అందుకోవడం హర్షణీయమన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల నాయకులు ఆమూరి బాలదాసు, కొప్పర్తి వెంకట రమణ, పెద్దివీటి నాగముని, దూదేకుల సంఘం అజ్మతుల్లా పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర పిలుపులో భాగంగా ఏఐటీయూసీ నాయకులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఉండబోదని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి స్వర్గసింగ్ కులస్తే ప్రకటించగా, అదేరోజు సాయంత్రం పెట్టుబడుల ఉపసంహరణ పురోగతిలో ఉంది గనుక నిర్ణయం కేంద్ర క్యాబినెట్ తీసుకోవాల్సి ఉంటుందని మాట మార్చడం శోచనీయమన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక దేశ సంపదను తెగనమ్ముతూ దివాళా తీస్తున్నారని ఆరోపించారు. మోదీ పాలనలో లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం కార్పొరేటర్ పరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరుని సన్నిధిలో జేసీ



జేసీని ఆశీర్వదిస్తున్న అర్చకుడు శశిధర్

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామిని సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం ఉదయం ఆయన మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్, అర్చకులు శశిధర్ బృందం ఆయనకు సంప్రదాయ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆ ప్రాంగణంలోని గణపతిని, తర్వాత శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేసవిలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



పాడిరైతులకు మందులు పంపిణీ చేస్తున్న వెంకటరమణయ్య

బద్వేలు అర్బన్ : వేసవి కాలంలో పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ టి.వి.వెంకటరమణయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ శంకరాపురంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహకారంతో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ పశు సంపద బాగుంటే పాడి పరిశ్రమ బాగుంటుందన్నారు. ఈ శిబిరంలో 23 పశువులకు గర్భకోశ చికిత్సలు, 46 పశువులకు సాధారణ చికిత్సలు, 31 దూడలకు, 50 గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నకేశంపల్లె, రాజుపాలెం పశువైద్యాధికారులు డాక్టర్ పవన్, డాక్టర్ నరసింహారెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ ఇంజనీరు జనార్దన్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎం.నరసింహాపురంలో మెగా పశువైద్య శిబిరం

బి.కోడూరు : జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పెద్దుళ్ళపల్లె వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని ఎం.నరసింహాపురం గ్రామంలో ప్రభల వీడు పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వాటర్‌షెడ్ టెక్నికల్ ఆఫీసర్ వెంకటరమణ, వాటర్‌షెడ్ ట్రినర్ చైతన్యలు పాల్గొని రైతులకు మందులను పంపిణీ చేశారు. వాటర్‌షెడ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి దూడలకు నట్టల నివారణ మందు తాపించి రైతులకు మినరల్ మిక్చర్, టానిక్‌లు అందజేశారు. ఈ శిబిరంలో 20 దూడలు, 425 గొర్రెలు, మేకలకు వైద్యం అందించారు. రైతులు వారి దూడలను, జీవాలను ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవాలని తెలిపారు. శిబిరంలో ఏహెచ్‌ఏలు నాగేంద్ర, వంశీ, బాలయ్య, రవి, వలంటీర్లు, రైతులు, వాటర్‌షెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023–24 ఏడాదికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని కేజీబీవీ స్పెషలాఫీసరు నాగలక్షుమ్మ తెలిపారు. మార్చి 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలైందని ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 40 సీట్లు ఉన్నాయని వివరించారు.

2007 అసైన్‌మెంట్ లబ్ధిదారులకు న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని బి.మఠం మండలంలో ఉన్న సోమిరెడ్డిపల్లె, మల్లెపల్లె, పలుగురాళ్ళపల్లె, పాపిరెడ్డిపల్లె, ముడుమాల గ్రామాల్లో 2006, 2007 సంవత్సరాలలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు కేటాయించిన లబ్ధిదారులకు సర్వే చేసి భూములు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్‌లు పేర్కొన్నారు. లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 సంవత్సరాల క్రితం పేదలకు భూములు కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు ఆ భూములను రైతులకు అప్పగించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోవిందు, వెంకటేష్, రమణమ్మ, సుబ్బమ్మ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పాల్గొన్నారు.

బాలలకు పుస్తకాలు అందజేత

కడప కల్చరల్ : కడప నగరం ఆర్తీ హోమ్ ఆధ్వర్యంలోని ఆర్తి పాఠశాల విద్యార్థులకు అమెరికాకు చెందిన డాటా ఫ్లిక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫౌండర్ ధీరజ్ నల్లగట్ల తన సిబ్బందితో కలిసి పలు రకాల పుస్తకాలను అందజేశారు. తాము నిర్వహిస్తున్న హైదరాబాదులోని నల్లగట్ల ఫౌండేషన్ పక్షాన వీటిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడుతూ పిల్లలకు మంచి చదువుతోపాటు వారు ఇష్టపడే రంగాల్లో రాణించేలా వారి లక్ష్యాలను నెరవేర్చుకునేలా పుస్తకాలు దోహదపడాలని సూచించారు. పిల్లలకు తల్లిదండ్రులు మంచి అలవాట్లు, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు ఆంగ్లంలో మాట్లాడేలా ఆంగ్ల దినపత్రికలు, కథల పుస్తకాలు అందజేసి చదివేలా చూడాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన పిల్లల కోసం నల్లగట్ల సుభాష్‌చంద్ర నాయుడు ఆర్తీ హోం కార్యదర్శి దుర్గాకుమారికి ఆర్థికసాయం అందజేశారు. పాఠశాల డైరెక్టర్ ఎం.భాగ్యమ్మ, సునీల్‌కాంత్ రాచమడుగు, సినోరిత, ప్రైమరీస్కూలు కో ఆర్డినేటర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దుష్యంత్, శ్రీధర్, ప్రీతమ్ జాన్సన్, తేజోమయి హల్దహళ్లి, మనోజ్‌వాల, శరత్‌చంద్ర, కె.జబీవుల్లా, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలోని రికార్డులను డీఈఓ వై.రాఘవరెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రొద్దుటూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా కూడా విధులు నిర్వహిస్తున్న ఈయన డీఈఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా డిప్యూటీ ఈఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఎంఈఓ సావిత్రమ్మ, డిప్యూటీ ఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

కడప అర్బన్: నగర శివార్లలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగి తిప్పిరిపాటి ప్రభాకర్ (65) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య జయమ్మ, కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఇంట్లో సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

పుష్పాలంకారంలో హేలాంబ అమ్మవారు



పుష్పాలంకారంలో హేలాంబ అమ్మవారు

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ హేలాంబ అమ్మవారు పుష్పాలంకారంలో దర్శనమిచ్చారు. హేలాంబ తిరునాల మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్ఛారణలతో చెప్పలి నరసింహ శాస్త్రి చేతుల మీదుగా అమ్మవారికి కంకణం కట్టారు. సాయంత్రం అమ్మవారికి పుష్పాలంకారం చేశారు. దివంగత జూటూరు వెంకట సుబ్బయ్య, పెద్ద సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. రాత్రి అమ్మవారిని పుర వీధుల గుండా పల్లకిపై ఊరేగించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఘనంగా పూర్వపు మఠాధిపతి ఆరాధన

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో పూర్వపు మఠాధిపతులు శ్రీవీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి ద్వితీయ ఆరాధన గురుపూజ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో ఉన్న వెంకటేశ్వరస్వామి సమాధికి కుటుంబ సభ్యులు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ద్వార పూజ కార్యక్రమం పూర్వపు మఠాధిపతులు పెద్దకుమారుడు వెంకటాద్రి స్వామి చేతుల మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వీరభద్రయ్య స్వామి, భద్రయ్య స్వామి, వీరంబొట్లయ్య స్వామి, దత్తాత్రేయస్వామి పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై అలుపెరగని పోరాటం

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మోదీని గద్దె దింపండి – దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సోమవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు.

నగర సమస్యల పరిష్కారానికి చర్యలు

– కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప సెవెన్‌రోడ్స్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 37వ డివిజన్ అల్మాస్‌పేట ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సాయిపేట ఆటోస్టాండ్ వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉందని, దాన్ని వెంటనే మార్చాలని సూచించారు. మహాదావ్య బరియల్ గ్రౌండ్‌లో ఉన్న కంప చెట్లను తొలగించాలని, శ్మశాన వాటికలో మట్టితో ఫిల్లింగ్ చేయాలన్నారు. వినాయక నగర్ బ్రిడ్జి వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ: సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 37 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 11, టౌన్ ప్లానింగ్ 6, పబ్లిక్ హెల్త్ 4, రెవెన్యూ 6, యూపీఏ 3, హౌసింగ్‌కు చెందిన 5 ఫిర్యాదులు ఉన్నాయి.

మహావీర్ మ్యూజియంను సందర్శించండి



మహావీర్‌మ్యూజియం

కడప కల్చరల్ : ఎన్నో అరుదైన శిల్పాలు, శాసనాలుగల కడప నగరంలోని మహావీర్ మ్యూజియంను సందర్శించాలని నిర్వాహకులు కోరారు. సోమవారం వారు సాక్షితో మాట్లాడుతూ మంగళవారం ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా మ్యూజియాన్ని తప్పక సందర్శించాలని జిల్లా వాసులను కోరుతున్నామని, ప్రత్యేకించి బాలలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మ్యూజియంలో మొత్తం 339 శాసనాలు ఉన్నాయని, 180 అరుదైన శిల్పాలు, ఇతర పాత్రలు, ఆయుధాలు, నాణేలు కూడా ఉన్నాయని తెలిపారు. నేటి తరానికి ఇవన్నీ ఒకేచోట చూసే అవకాశాన్ని మహావీర్ మ్యూజియం కల్పిస్తోందన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు తెరిచే ఉంటుందని, పిల్లలకు రూపాయి, పెద్దలకు రూ. 3 రుసుము ఉంటుందని తెలిపారు.

ప్రజలపై భారం మోపుతున్న బీజేపీ



నగరంలోని రవీంద్ర నగర్‌లో ప్రచార భేరిని నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందని సీపీఐ నగర కార్యదర్శి కేసీ బాదుల్లా మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సోమవారం నగరంలోని రవీంద్ర నగర్‌లో ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ప్రత్యేకహోదా, నిధులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు, దేశాన్ని రక్షించుకునేందుకు మతోన్మాద బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మునెయ్య, లింగన్న, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాధన ఉత్సవ ఏర్పాట్లకు టెండర్లు

బ్రహ్మంగారిమఠం : ఈనెల 27 నుంచి శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు బ్రహ్మంగారిమఠంలో ప్రారంభంకానున్నాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం చలువపందిళ్లు, లైటింగ్, డెకరేషన్ల కోసం టెండర్లను ఆహ్వానించారు. టెండర్లను ఓపెన్ చేసి తక్కువ కోట్ చేసిన ప్రొద్దుటూరుకు సప్లయర్స్ నిర్వాహకుడికి పనులను అప్పగించారు. మంగళవారం నుంచి బ్రహ్మంగారిమఠంలో చలువ పందిళ్లు, లైటింగ్ డెకరేషన్లు ఏర్పాటు చేయాలని శంకర్ బాలాజీ ఆదేశించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉక్కాయపల్లె డంప్ యార్డ్ వద్ద సోమవారం సాయంత్రం మట్కా రాస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు తెలియజేశారు. అరెస్టయిన వారిలో గోగుల వెంకటరమణ, ఇంకా ఇద్దరు ఉన్నారు. వారి వద్ద నుంచి రూ. 31.050 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డిని సీఐ అభినందించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన అనాథ వృద్ధుడు బడిగించల కృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయనకు అంతిమ సంస్కారాలు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు ఆధ్వర్యంలో హిందూ సాంప్రదాయ ప్రకారం కృష్ణ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

కంటి అద్దాలు పంపిణీ

కమలాపురం: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. సోమవారం కడపకు చెందిన ఎస్‌పీసీబీ సంస్థ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 523 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పవర్‌హౌస్ రోడ్డులో సోమవారం స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన 200 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ప్రముఖ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సీఐ ఇబ్రహీం తోఫా అందజేశారు.